# సరికి సరి

పక్కి బాలకృష్ణారావు

అదొక చిన్న పల్లె గ్రామం. అందులో మాత్రం ఏవో రెండు మూడు ఆఫీసు లున్నాయి. కోర్టు తగాదాలకని, వీటికని వాటికని ఆ గ్రామానికి చుట్టుప్రక్క లూళ్ల దగ్గరనుండి వస్తూ పోతూంటారు. మరి ఈవచ్చేపోయేవాళ్లకని భోజనా లెక్కడివి? కనికరించి ఓయమ్మ కూళ్లు పెట్టేది. చక్కగ ఓకూర, ఓపచ్చడి, యింత ఆవకాయ, మజ్జిగ పోసి, మనిషి భోజనం 0-6-0 అని బోర్డు తగిలించింది. తిని పోయేవాళ్ళతోనే ఆ పూటకూళ్ళమ్మ పని తీరిపోయేది. బాగా ఆర్జించిందని అందరూ అనుకున్నారు. అనుకోవట మేమిటి? కనబడుతూనే ఉంది! పూర్వం తినేవాళ్లు ముందుకొచ్చి ఇంతమంది వస్తున్నాం అని కొంత అడ్వాన్సు యిచ్చేవారు. ఇప్పుడో? వచ్చి, తిని, డబ్బు యిచ్చేయటమే! ఇదంతా ఆ గ్రామంలోని రావయ్యమ్మ అనే పేదరాలుకు కొంచెం కన్ను కుట్టిందనే చెప్పాలి. పూట భోజనం 0-4-0 అని బోర్డు వ్రేలాడ కట్టేంది. 0-2-0 తగ్గిందని అందరూ ఇక్కడ కొస్తారని ఆశ. కొంచెం తెలివితేటలుండేవాళ్ళు "ఇది 0-4-0 భోజనం. అది 0-6-0 భోజనం" అనుకుని అక్కడికే పోయేవారు. కొంచెం నిరుపేదల్లాంటివాళ్ళు మాత్రం వచ్చేవారు. ఆ వచ్చేవాళ్లని మహాచక్కగా ఆదరించేది. రాగానే వాళ్ళను కూర్చోపెట్టేది. ఎంతో దూరం నుండి నడిచి వచ్చారేమో, చెమటలు కక్కుకుంటూ "అస్సో-యిస్సో" అనుకునేవారు. ఆ సమయంలో విసనకర్రల సదుపాయం చేసేది. నడక ప్రయాసవలన గొంతు ఆర్చుకపోయేది. పాపం రాగానే కొంచెం మంచినీళ్లు అడిగి త్రాగేవారు. ఆ సమయంలో రావయ్యమ్మ గంజిలో కాస్త నీళ్ళుపోసి, పలుచగా చేసి కొంత ఉప్పుకలిపి యిచ్చేది. ఆ గంజినీళ్ళు ఆ గొంతు ఆర్చుకపోయేవాళ్లకు ఎంతో సేద తీర్చేది. రావయ్యమ్మ ఆదరాభిమానాలకు వాళ్లెంతో పొంగిపోయేవారు. రావయ్యమ్మ ఆ పూటకూళ్ళమ్మకంటే చాల జాలి గుండె కలదనీ, డబ్బులేనివారిని కనికరించి రోజుకి ఒకరికో యిద్దరికో ఉత్తినే పుణ్యానికి అన్నం పెడుతుందని ఆ గ్రామం అంతా అనుకునేవారు. దాంతో రావయ్యమ్మ రోజులు మంచివయ్యాయి. రెండు చేతులా డబ్బు ఆర్జించటంతో కొంచెం దుర్బుద్ధి పుట్టింది. రోజూ గంజినీళ్లు ముందుగ యిచ్చేటప్పుడు వాళ్ళు "చాలమ్మా" అన్నా "మొహమాటపడకు నాయనా. శుభ్రంగా దాహం తీర్చుకో! పొయ్యిమీద కూర ఉంది. దిగ్గానే భోజనాలు పెడతా. చూడు నాయనా! వ్యాపారం దగ్గరా భోజనందగ్గరా మొహమాటపడకూడదు. మరి కొంచెం దాహం పుచ్చుకో!" అని మంచిమాటలాడి వాళ్ల చేత బలవంతాన త్రాగించేది. పాపం! అమాయకులు కడుపు గంజినీళ్లతో నింపుకునేవారు. తీరా భోజనాలకు కూర్చునేసరికల్లా యింకేంతింటారు? కడుపునిండా గంజినీళ్లేగా! ఏదో కాస్త ఎంగిలిపడి సంతృప్తిపడేవారు. మరి వీళ్ళంతా అట్టే మిగతా వాళ్లలా తినలేకపోయేవారు. మరిదంతా కలిసి వచ్చేది. యిలాంటివాళ్ళకి 0-2-0కు పెట్టినా రావయ్యమ్మకు లాభం వచ్చేది. ఇలాగు అమాయకులనందరినీ మోసంచేసి భోజనం పెట్టేది. అందులోను పల్లెటూరి ప్రజల్లో చాలమంది అమాయకులేగా! అన్యాయంగా బాగా డబ్బు ఆర్జించింది.

ఈవిధంగా రోజులు గడుస్తూంటే వీర్రాజనే బాటసారి ఒకసారి

# ★ సరికి సరి ★

వచ్చాడు. మామూలుగ అందరి లాగునే అలసటగా ఉండటంచూచి "ఏం నాయనా! కొంచెం దాహం పుచ్చుకుంటావా!"అంది. "లేదమ్మా! భోజనమే చేస్తాను" అన్నాడు వీర్రాజు. "కొంచెం ఆలస్యం ఉంది నాయనా. పొయ్యిమీద కూరఉంది. దిగ్గానే పెడతాను" అంది. అమిత దాహంగా ఉంది వీర్రాజుకు. మరేం చేస్తాడు? కొంచెం గంజినీళ్లు పుచ్చుకున్నాడు. అతిదాహంగా ఉన్న వాళ్ళకు ఆ త్రాగేది కొంచెం ఉప్పగాఉంటే మరీ రుచిస్తుంది సంతృప్తిపడినట్లు ముఖం పెట్టగానే రావయ్యమ్మ మరింత పోసింది. ఆలాగే వీర్రాజుతో ఉన్న వాళ్లంతా త్రాగేరు. ఎవరెవరు ఎందుకు వచ్చారో ఏ ఊరో యిత్యాది ప్రశ్నలతో కాలయాపన చేసేవాళ్ళువారు. వీర్రాజు ప్రక్కవాడిని అడిగాడు "ఏమండీ! ఈ గంజినీళ్లకూ్కడ డబ్బు పుచ్చుకుంటుందా?" అని. "అబ్బే!" అని తల అడ్డుగా తిప్పాడతను ఇంతలో భోజనాలకు రమ్మని కేకవచ్చింది. అందరూ వచ్చారు గాని వీర్రాజు రాలేదు. రావయ్యమ్మ వచ్చి రమ్మంది. "చూడమ్మా! నాకు తెలియకడుగుతాను. యిందాక పోసిన గంజికూ్కడ డబ్బు పుచ్చుకుంటావా?" అన్నాడు.

"అదేమిటి నాయనా! అలా గడుగుతున్నావు. ఏదో దాహంకని యిచ్చాను కదా, దానికెందుకు? యివ్వడెందుకది రా నాయనా" అంది. "అయితే మరి నాకు భోజనం పెట్టవద్దు; నీకు నేను 0-4-0 యివ్వావొద్దు, నా ఆకలితీరి పోయింది. నేపోతాను"అని లేవపోయాడు. రావయ్యమ్మ నీరైపోయింది. అప్పుడు భోజనాలకు వచ్చేవాళ్ళంతా గుమిగూడారు. "చూశారయ్యా! భోజనానికని వచ్చి, మరి చెయ్యనంటాడు. మరదంతా నేను నష్టపోవటమేనా! నువ్వు తినూ-మానూ, 0-4 0 యిచ్చివెళ్లు" అంది రావయమ్మ గట్టిగా. అప్పుడు వీర్రాజు ముందుకొచ్చి "చూశారయ్యా! ఆమె మోసం. రాగానే కడుపు నిండేట్లు గంజిపోసింది. యిప్పుడు ఏం తినగలం? ముందు గంజినీళ్లు బాగా త్రాగితే, యిక మనం తిన్న అన్నం తక్కువవుతుందని మోసంతో యిలా గంజినీళ్ళు బలవంతాన పోస్తూంది. మీలో ఎవరయినా చెప్పండి. మీరు పూర్తిగ భోజనం చేయగలరా? అంచేత 0-4-0 యివ్వటం శుద్ధ దండుగ. నిజంగా ఈ భోజనానికి 0-2-0 యివ్వాలి. యిప్పుడర్థమయ్యిందా, ఈమె ఎందుకు ముందుగ మంచిమాటలతో బలవంతాన గంజినీళ్లు త్రాగిస్తుందో?" అన్నాడు ఆవేశంగా. అంతా ఔనన్నారు. "0-2-0 అయితే భోజనం చేస్తాం. అప్పుడే మా కడుపంతా గంజితో నిండిపోయింది. యింకేం తింటాం. 0-2-0 అయితే సరే, లేకపోతేమేం తినం" అని అంతా వచ్చేశారు. రావయ్యమ్మ మోసం బయలుపడగానే బిక్కముఖం వేసింది. నీరసంగా "రండి" అంది ఒప్పుకున్నట్లు. లేకపోతే ఎలా? చేసిన వంటకం అంతా దండుగ. వృధా. అంతా భోజనంగా చేస్తూ వీర్రాజును మెచ్చుకున్నారు. రావయ్యమ్మను బాగా ఆడిపోశారు. దాంతో రావయ్యమ్మ దుర్బుద్ధి పోయింది అప్పటినుండి యథాప్రకారంగా వంటకం చేసేది గాని, గంజినీళ్లు అడిగినా యిచ్చేది కాదు. చూశారా! రావయ్యమ్మకు తగిన వీర్రాజు రాబట్టిగాని, లేకపోతే యింక అన్యాయార్జితం కూడబెట్టేదిగా! ★

## అసమర్థుని తత్వకథ

(11-వ పేజీ తరువాయి)

ఆప్రక్రిగా అమ్మని కేకవేసినప్పుడు, ఆమె కళ్లనీళ్లు పెట్టుకున్నప్పుడు, నాకంత బాధ అనిపించదు. ఆత్మ విమర్శ చేసుకునే ఆక్షణంలో అమ్మని తలుచుకున్నప్పుడు, నేనొక పశువు ననిపిస్తుంది నాకు అట్లా అనుకోవటమే అమ్మకి ఒక విధంగా క్షమాపణ చెప్పుకోవటం అనుకుంటా.

అమ్మ ఏవో సంబంధాలు వ్రాసి తెస్తుంది. ఆమెని పంపించేటప్పుడు నాకు ఏ భావమూ వుండదు. సాయంత్రం ఏ పార్కులోనో కూర్చొని. ఆలోచిస్తా. నాకే నవ్వొస్తుంది. నా జీవితమెంత? నా జీతమెంత? ఒక వ్యక్తిని అదనంగా పోషించగల బాధ్యత వహించగల శక్తి నాకు వుందా? లోకంలో దారిద్ర్యంతో కుమిలిపోతున్న ఎంతమందిని చూడటం లేదు? నా సంపాదనా, నా పరిస్థితులు తెలుసుకునేటప్పటికి, నా జీవితం మీద నాకే రోత పుడుతుంది ఈ ఊబిలోకి అన్యాయంగా యింకొక వ్యక్తిని దించి, భావి జీవితాన్ని గురించి మధురమైన కలలు కనే ఆ వ్యక్తి జీవితానికి తీవ్రాఘాతం కలిగించటం నాపట్ల రాక్షసత్వంగా కనిపిస్తుంది. మనస్సులో ఒక నిశ్చయానికి వస్తా. పెండి సంబంధాలు మోసి వచ్చిన అమ్మకూ నాకూ యిదే సంభాషణ

చివరికి అమ్మ విసిగి 'నీ మనస్సుకి నిలకడ లేదు. నీకు జీవితంలో సుఖపడే విధం తెలియదు. ఒకరు చెపితే వినవు' అంటుంది నిస్పృహాయంగా. అక్కడితో సంభాషణ తుంచేసి అక్కడి నుంచి లేచిపోతా.

నా యీ ఇరవై ఏళ్ళ జీవితం నుంచి నేపొందిన అనుభవం ఒక్కటే. నిరాశ. ఆశని కూడా క్రమమైన మార్గంలో, పరిమిత అవధుల్లో పెంచుకోవాలి. అట్లా కాని